ఓటర్ నమోదులో బాధ్యతగా వ్యవహరించాలి

కుత్బుల్లాపూర్ ఈఆర్వో, ఉప కమిషనర్ నరసింహ



టీఎల్ఓలతో సమావేశమైన ఈఆర్వో నరసింహ

కుత్బుల్లాపూర్: నూతన ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులపై సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కుత్బుల్లాపూర్ ఈఆర్వో, ఉప కమిషనర్ నరసింహ అన్నారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, బూత్ లెవెల్ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా ఎన్నికల కమిషన్ నూతన ఓటర్ నమోదు ప్రక్రియను చేపట్టిందని తెలిపారు. ఎన్నికల సిబ్బంది కేటాయించిన బూత్ లెవల్‌లో ఇంటింటికీ తిరుగుతూ నూతన ఓటర్ల నమోదు, మృతులు, ఇల్లు మారిన వారి వివరాలను నమోదు చేయాలన్నారు. వివాదాలకు తావు లేకుండా పని చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రెహమాన్‌ఖాన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



గాయత్రినగర్‌లో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలో చేరిన వరదనీరు

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా?

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీళ్లు చేరి నీటి కుంటలను తలపిస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు ప్యాచ్ వర్క్‌పనులు చేపట్టడం లేదు. జీడిమెట్ల డివిజన్ గాయత్రినగర్‌లోని ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకుండా ఫిర్యాదును క్లోజ్ చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు గాయాల పాలవుతున్నారని, మాన్‌సూన్ సిబ్బందితో తాత్కాలిక ప్యాచ్ వర్క్‌లైనా చేయించాలని గాయత్రినగర్ వాసులు కోరుతున్నారు.

తులసిరెడ్డిని సన్మానించిన ఎమ్మెల్సీ

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్‌కు చెందిన పర్వతారోహకుడు తులసిరెడ్డి శుక్రవారం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐరోపా ఖండంలోని మౌంట్ ఎల్బ్రస్ పర్వత శిఖరాన్ని తులసిరెడ్డి అధిరోహించి జాతీయ జెండాను ఎగురవేశాడు. తులసిరెడ్డిని ఎమ్మెల్సీ సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తదిరతులు పాల్గొన్నారు.



తులసిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

ఐదు టిప్పర్లు సీజ్



బాచుపల్లి పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

నిజాంపేట్: ప్రభుత్వ ఖాళీస్థలాల్లో చెత్తాచెదారాలను డంప్ చేస్తున్న ఐదు టిప్పర్లను బాచుపల్లి పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. గాజులరామారం, సూరారం, కైసర్‌నగర్ ప్రాంతాల నుంచి వ్యర్థాలను టిప్పర్లలో తీసుకువచ్చి బాచుపల్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో డంప్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న సీఐ ఉపేందర్ సిబ్బందితో వెళ్లి టిప్పర్లను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్థానికంగా చెత్తను డంప్ చేస్తూ కాలుష్యానికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మొబైల్ పోతే సీఈఆర్ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి

కుత్బుల్లాపూర్: మొబైల్ చోరీకి గురైన వారు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్టర్ (సీఈఆర్ఈ) పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మేడ్చల్ డీసీపీ పరిధిలో చోరీకి గురై రికవరీ చేసిన 130 ఫోన్లను శుక్రవారం బాధితులకు అందజేశారు. పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో 32, ఆల్వాల్ పీఎస్ పరిధిలో 20, శామీర్‌పేట్ పీఎస్ పరిధిలో 8, మేడ్చల్ పరిధిలో 20, దుండిగల్ పీఎస్ పరిధిలో 35 స్మార్ట్ ఫోన్‌లు, సూరారం పీఎస్ పరిధిలో 15 మొబైల్ ఫోన్లను మేడ్చల్ క్రైమ్ టీమ్ పోలీసులు రికవరీ చేశారు. మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో బాధితులకు ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ప్రయాణించే సమయంలో మొబైల్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలని, లాకింగ్, సీక్రెట్ కోడ్ ఏర్పాటు వేసుకుంటే చోరీకి గురైనా వాటిలో డేటాను చూసేందుకు వీలు ఉండదన్నారు. కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ డీఈ నరసింహరాజు, ఆల్వాల్ డీఐ రాజేందర్‌గౌడ్, మేడ్చల్ డీఐ వెంకటరెడ్డి, దుండిగల్ డీఈ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ బ్రాంచ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లు

సీఎండీ ప్లాంట్‌ను సందర్శించిన అధికారుల బృందం



సీఎండీ ప్లాంట్‌ను సందర్శించిన సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

సుభాష్‌నగర్: జీడిమెట్లలో ఉన్న సీఎండీ ప్లాంట్‌ను సంగారెడ్డి జిల్లాలోని మున్సిపల్‌లో ఏర్పాటు చేసేందుకు అక్కడి అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్, సంగారెడ్డి మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు ప్రసాద్‌చౌహాన్, రంగారెడ్డి, జ్యోతి, మంగతాయారు సీఎండీ ప్లాంట్‌ను సందర్శించి పనితీరును పరిశీలించారు. అక్కడి అధికారులను పలు సందేహాలు అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ వేస్టేజీతో ఇనుము, ఇసుక, కంకర ఇతర ముడి సరుకు సామగ్రిని ఈ యంత్రం ఎలా వేరు చేస్తుందనే విషయాన్ని గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి, సిబ్బంది వారికి వివరించారు. త్వరలో సంగారెడ్డి జిల్లాలోని పలు మున్సిపల్‌లో సీఎండీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.



'త్రివేణి'లో నేషనల్ స్పేస్ డే

కుత్బుల్లాపూర్ : త్రివేణి స్కూల్‌లో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని(నేషనల్ స్పేస్ డే) నిర్వహించారు. చంద్రయాన్ 3 విజయవంతం చేసిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతకాల సేకరణ చేపట్టారు. జయహో ఇస్రో.. జయహో భారత్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివ కీర్తన, సీఆర్వో వెంకట్రావు, ప్రిన్సిపాల్ శ్రీసుధ, సీఎస్‌వో సుబ్బారావు, క్యాంపస్ ఇన్‌చార్జి క్రాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్ నిర్వహణ గాలికి!

- అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారిన వైనం
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



చింతల్: కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన భగత్ సింగ్‌నగర్ మోడ్రన్ కల్యాణ మండపం గాలిలో దీపంలో మారింది. సుమారు రూ.4.30 కోట్లతో నిర్మించిన ఈ మోడ్రన్ ఫంక్షన్‌హాల్ అక్రమ పార్కింగ్‌లకు, స్థానికంగా ఉండే చిన్నారులకు ఆటస్థలంగా మారింది. స్థానిక నేతలు, అధికారులు పట్టించుకోకపోవడంతో నేడు ఫంక్షన్ హాల్‌కు సంబంధించిన విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయి. ప్రతి ఫంక్షన్‌కు చార్జీల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు ఫంక్షన్‌హాల్ నిర్వహణను గాలికి వదిలేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వాష్ బేసిన్ల నల్లాలు దొంగిలించబడ్డాయి. రెండు నెలలు గడిచినా జీహెచ్ఎంసీ అధికారులు వాటిని తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో కల్యాణ మండపంలో ఫంక్షన్ జరిగిన ప్రతిసారి నీరు వృథాగా పోతుంది. కొంతమంది చిన్నారులు కల్యాణ మండపం ఆవరణలో క్రికెట్ ఆడుతుండగా బంతి తలిగి ఫంక్షన్‌హాల్ అద్దాలు ధ్వంసం అయ్యాయి. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఫంక్షన్ హాల్ లోకి నీరు చేరి శుభకార్యాలు చేసుకునే వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. చార్జీల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్న అధికారులు నల్లాలను, పగిలిన అద్దాల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌పై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావుపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం 14వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు దుద్దు రాహుల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వైస్ చైర్మన్ స్థానికంగా సర్వే నెంబర్ 131లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి 80 నుంచి 100 గజాల ప్లాట్లు చేసి అమాయకులకు అమ్ముతున్నట్లు ఆరోపించారు. ఈ విషయమై ఎవరైనా ప్రశ్నిస్తే అధికార బలంతో బెదిరింపులకు పాల్పడుతున్నారని, రెవెన్యూ కిందిస్థాయి సిబ్బంది అతడికి సహకరిస్తున్నారని తహసీల్దార్‌కు వివరించారు.

వీసా కన్సల్టెన్సీ నిర్వాహకుడి కిడ్నాప్

- సూర్యాపేట పరిధిలో కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆరుగురి రిమాండ్

నిజాంపేట్: ఓ వీసా కన్సల్టెన్సీ ఏజెన్సీ నిర్వాహకుడిని కిడ్నాప్ చేసిన ఆరుగురు వ్యక్తులను బాచుపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట్‌కు చెందిన శివశంకర్‌రెడ్డి(55) వీసా కన్సల్టెన్సీని నిర్వహిస్తున్నాడు. విదేశాల్లో మెడిసిన్ చదువు నిమిత్తం వీసాలు పొందేందుకు రూ.4 లక్షలు చెల్లించిన ఎర్న వీరయ్య, పోరెండ్ల దశరథ, మందాడి శ్రవణ్‌కుమార్, అలుగుబెల్లి వెంకట్‌రామిరెడ్డి, బానోత్ నాగు, ఎర్ర పద్మ తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని శంకర్‌రెడ్డిని కోరగా.. అతను నిరాకరించాడు. దీంతో తమ డబ్బులు రాబట్టుకునేందుకు వారు గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నిజాంపేట్‌లోని శివశంకర్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించి బీభత్సం సృష్టించారు. అడ్డు వచ్చిన అతడి భార్య, కుమార్తెను కొట్టి శివశంకర్‌రెడ్డిని కిడ్నాప్ చేశారు. ఈ విషయమై ఫిర్యాదు అందుకున్న బాచుపల్లి పోలీసులు వెంటనే రాచకొండ కంట్రోల్, నల్గొండ, సైబరాబాద్ కంట్రోల్ రూమ్‌లను అలర్ట్ చేశారు. సూర్యాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కారును వెంబడించి కిడ్నాపర్ల చెర నుంచి శివశంకర్‌రెడ్డిని పోలీసులు కాపాడారు. కారును స్వాధీనం చేసుకుని కిడ్నాపర్లను రిమాండ్‌కు తరలించారు. కిడ్నాపర్లను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన బాచుపల్లి పోలీసులను కూకట్‌పల్లి ఏసీపీ, బాలానగర్ డీసీపీలు అభినందించారు.

సందేహాలను నివృత్తి చేసుకోవాలి

కూకట్‌పల్లి: ఆయా సబ్జెక్టుల్లోని సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జేఎన్ ఆడిటోరియంలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.వి. నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. కళాశాల నాలుగు సంవత్సరాల విద్యార్థులు తమ అనుభవాలు పంచుకొని, విద్యా విధానం, విద్యార్థుల విజయాలు, క్లబ్‌ల వివరాలు తెలిపారు. ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి జేఎన్‌టీయూ కళాశాలలోని సౌకర్యాలు, ల్యాబ్ సదుపాయాలు వివరించారు. 9వ ర్యాంక్ సాధించిన విద్యార్థిని జేఎన్‌టీయూలో చేరినందుకు అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

కుత్బుల్లాపూర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ అన్నారు. గాజులరామారంలోని నల్లపోచమ్మ, రేణుకా ఎలమ్మల విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, గోవర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం, విజయ్ కుమార్, జ్ఞానేశ్వర్, కిరణ్, రవి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబర్ వంశీ కుమార్ అరెస్ట్



మూసాపేట: రోడ్డుపై డబ్బులు ఎగరవేసిన యూట్యూబర్ వంశీకుమార్‌పై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. పర్వత్‌నగర్‌లో ఉండే వంశీకుమార్ (24) యూట్యూబర్‌గా రాణిస్తున్నాడు. బెట్టింగ్ ప్రమోషన్‌లో భాగంగా కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో రోడ్డుపై డబ్బులు ఎగరవేసి వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. డబ్బులు ఎగరవేసిన క్రమంలో డబ్బుల కోసం ప్రజలు రోడ్డుపైకి రావటంతో వాహనదారులకు అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు వంశీకుమార్‌పై న్యూసెన్స్, రోడ్డు ఇబ్బంది, ర్యాష్ డ్రైవింగ్ వంటి కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆటో చోరీ నిందితుడి రిమాండ్

నిజాంపేట్: ఆటో చోరీకి పాల్పడిన నిందితుడిని బాచుపల్లి పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆటో డ్రైవర్ నర్సింహులుగౌడ్ ఈ నెల 21న బాచుపల్లిలోని మల్లంపేట్ రోడ్డులో ఉన్న బెంగళూర్ అయ్యంగార్ బేకరీ వద్ద తన ఆటోను పార్కు చేయగా చోరీకి గురైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో నాగర్ కర్నూల్‌కు చెందిన ఇశ్లవత్ బాబు అనే పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. ఆటోను రికవరీ చేశారు. గతంలో జైలుకు వెళ్లొచ్చిన బాబు 18 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇతడిపై మియాపూర్, అల్వాల్, పేట్ బషీర్‌బాద్, నాగర్ కర్నూల్, మేడ్చల్ పీఎస్ పరిధిలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు బాబుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏసీఎస్‌వోకు సన్మానం

కుత్బుల్లాపూర్: బాలానగర్ సర్కిల్-1 ఏసీఎస్‌వోగా కల్యాణ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇంద్రసేన గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం కల్యాణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మధుసూదన్ యాదవ్, సలహాదారులు నాగిర్ల శ్రీనివాస్, మర్యాద అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఏసీఎస్‌వోను సన్మానిస్తున్న డీలర్లు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు గాయత్రినగర్, గోదావరి హోమ్స్, జీకేనగర్, 11కేవీ బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బ్యాంక్ కాలనీ, రాఘవేంద్రనగర్, వెంకటేశ్వర కాలనీ, హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ, 11కేవీ సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు సాయిబాబానగర్, బాల్‌రెడ్డినగర్, బాపునగర్, దత్తాత్రేయనగర్, వాజ్‌పేయినగర్, ఎంఎన్ రెడ్డి నగర్, పద్మానగర్ ఫేజ్ 2, సంజీవయ్యనగర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2 గంటల వరకు 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని రంగారెడ్డిబండ, వైష్ణవి ఎన్‌క్లేవ్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, ఎస్ఎల్ఎన్ డెవలపర్స్ కాలనీ, గంగా ఎన్‌క్లేవ్‌లలో, అదే విధంగా 11 కేవీ ఫీడర్ లైన్ల ఎక్స్‌టెన్షన్ పనుల నేపథ్యంలో 11కేవీ మీనాక్షి, జీడిమెట్ల, జైన్‌కన్‌స్ట్రక్షన్స్, సుచిత్ర, ప్రాగాటూల్స్, పైపులైన్ రోడ్డు ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నిజాంపేట్: కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీ, ఫీడర్ల నిర్వహణ సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కేవీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రణీత్ నేచర్ భౌంటీ, కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్ ఉడ్స్, జీఎస్ఆర్ విల్లా, స్టెర్లింగ్ హోమ్స్, 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు సూరారం గ్రామం, అయ్యప్ప సొసైటీ, విశ్వకర్మకాలనీ, 11కేవీ బౌరంపేట్ కేబుల్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బౌరంపేట్, ఆర్కే లేఅవుట్, సారెగూడెం రోడ్డు, 11కేవీ బౌరంపేట్ గ్రామ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల వరకు నేచర్ సిటీ విల్లాస్, వేదా స్కూల్, ల్యాండ్‌మార్క్-3, అపురూప కాలనీ, 11కేవీ ప్రణీత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు ప్రణీత్ ఫ్లోరా ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

బాచుపల్లి సెక్షన్ పరిధిలో..

11కేవీ సాయినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు సాయినగర్, రాజీవ్‌గృహకల్ప, వీఎన్ఆర్ కళాశాల, 11కేవీ వికాస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు వికాస్ స్కూల్, మావిల్లాస్. 11కేవీ ఏఈ టైర్ ఫీడర్ పరిధిలో మల్లంపేట్, 11కేవీ జీపీఆర్ లేఅవుట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల వరకు కేఆర్‌సీఆర్ కాలనీ, రెయిన్‌బో కాలనీ, ప్రణీత్ జెనీత్, బ్లాక్ డైమాండ్ కాలనీ, ఐడీపీఎల్ కాలనీ, జీపీఆర్ లేఅవుట్‌లో సరఫరా ఉండదని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రోడ్డు పనులు చేయిస్తున్న కూన రాఘవేందర్ గౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకుడు కూన రాఘవేంద్రగౌడ్ అన్నారు. శుక్రవారం రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షం పడ్డ ప్రతి సారి కాలనీల్లోకి వరద నీరు రావడం పరిపాటిగా మారిందన్నారు. కళావతి నగర్‌లో ఈ సమస్యను గుర్తించిన మాజీ కౌన్సిలర్ రజిత రత్నం, హలీం, గాదే వినోద్ తన దృష్టికి తీసుకురావడంతో సమస్య పరిష్కారానికి కృషి చేశానని అన్నారు. సమస్యను పరిష్కరించేందుకు రాఘవేందర్ గౌడ్ ఆర్ఎంసీతో కాలనీలోకి నీరు రాకుండా దగ్గరుండి పనులు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జుబేర్, ఫిరోజ్, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

ఆస్తి కోసం అల్లుడే హత్య చేసి ఉంటాడని అనుమానం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి


దుండిగల్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గాగిలాపూర్‌తండాకు చెందిన జరుపుల శాంతి (50) కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తుంది. శాంతి భర్త బాలు నాయక్ 21 సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. గతంలో కుమారుడు సైతం చనిపోయాడు. తన కుమార్తె ఉమారాణిని అదే తండాకు చెందిన భాస్కర్‌కు ఇచ్చి ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిపించింది. అప్పటి నుంచి శాంతి ఒంటరిగానే జీవిస్తుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి శాంతిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, దుండిగల్ సీఐ సతీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శాంతి తల, ముఖం, మోకాళ్ల భాగాలపై బలమైన గాయాల వల్లే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

అల్లుడి పైనే అనుమానం..

పోలీస్ జాగిలాలు హత్య జరిగిన ప్రాంతం నుంచి నేరుగా అదే ప్రాంతంలో నివసిస్తున్న అల్లుడు భాస్కర్ ఇంటితో పాటు అతడి చుట్టే తిరగడంతో అల్లుడే హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. శాంతికి గాగిలాపూర్‌లో ఐదు కోట్ల విలువ చేసే ఎకరం పొలం ఉండటంతో పాటు మరో ప్రాంతంలో మరో ఎకరం ఉండటంతో జులాయిగా తిరిగే అల్లుడు ఆస్తి కోసమే అత్తను హత్య చేసి ఉంటాడని తండావాసులు కూడా ఆరోపిస్తున్నారు. ఈ మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వినాయక నిమజ్జన ఏర్పాట్లు



మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువులో వినాయక నిమజ్జనానికి అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఐడీఎల్ చెరువు కట్టపై విద్యుత్ లైట్ల కోసం పనులు ప్రారంభించారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలను ఏర్పాట్లు చేస్తున్నారు. కొలనులో చిన్న విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. కొలనును శుభ్రం చేయాలని భక్తులు కోరుతున్నారు. చెత్తా చెదారంతో పాటు తినుబండారాల వ్యర్థాలు, ప్లేట్లతో కొలను నిండిపోయింది. దీంతో వ్యర్థాలు కుళ్లిపోవటంతో దుర్గంధం వెదజల్లుతుందని, ఆ నీటిని తొలగించి కొత్త నీటిని నింపాలని కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా వెదురు బొంగు కలప చెట్లతో షెడ్డు లాగా కనిపిస్తున్న సీన్ ఎంతో బాగుంది అనిపిస్తుంది కదూ. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని అశోక ఏలా మైసస్ ఓ ప్లాటు యజమాని తన స్థలంలో వెళ్తున్న రోడ్డులో ఇలా సుందరంగా తీర్చిదిద్దారు. ఆ కాలనీకి వచ్చినవారు ఈ సీన్‌ను చూసి కాసేపు అక్కడే నిలబడి పోతున్నారు. – సుభాష్‌నగర్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029